క్లుప్తంగా

ఘనంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవ్



ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా జెండా వందనం చేస్తున్న మెప్మా సిబ్బంది

కడప కార్పొరేషన్ : ఆజాదీకా అమృత్ మహోత్సవ్(నా భూమి- నా దేశం) కార్యక్రమాన్ని మెప్మా సిటీ మిషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి, జాతీయ జెండాకు వందనం చేశారు. హర్ ఘర్ తిరంగా ర్యాలీలు చేపట్టారు. డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, జిల్లా యూత్ కో ఆర్డినేటర్ మణికంఠ, సీఎంఎం హరిప్రసాద్‌రెడ్డి, సీఓలు పాల్గొన్నారు.

శిల్పారామంలో చిన్నారుల ఆట-పాట



శిల్పారామంలో విద్యార్థుల నృత్య ప్రదర్శనలు

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై స్థానిక ఎన్జీఓ కాలనీకి చెందిన విజిల్ డ్యాన్స్ అకాడమి విద్యార్థులు తమ ఆటపాటలతో సందడి చేశారు. సామాజిక అంశాలపై పలు కామెడి స్కిట్‌లను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. పలు ప్రాచుర్యం పొందిన సినీ గీతాలకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. శిల్పారామం పాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఆదరణ ఆశ్రమంలో అన్నదానం



ఆదరణ ఆశ్రమంలో అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు

కడప కార్పొరేషన్ : కడప నగరం పాత రిమ్స్‌లోని ఆదరణ నిరాశ్రయుల వసతి గృహంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎం. చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సోదరుడు ఎం. శివానందరెడ్డి 5వ వర్ధంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బంధుమిత్రులు పి. మాధవరెడ్డి, టి. రఘురాం, శ్రీకాంత్, డి. సుబ్బరాయుడు, క్రిష్టారెడ్డి, వసతి గృహం నిర్వాహకుడు విజయ్ బాబు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో ఉద్యోగానికి ఎంపిక



బొంత పావని, మహేష్ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతోనే గ్రూప్ ఫలితాల్లో డీఎస్పీ ఉద్యోగానికి ఎంపికయ్యానని బొంతా పావని పేర్కొన్నారు. ఆదివారం శ్రీకృష్ణాలయం యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో బొంత పావని, మహేష్ దంపతులను కృష్ణాలయంలో శాలువాకప్పి, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు, అత్తామామ, భర్త ప్రోత్సాహంతోనే ఉద్యోగం సాధించానన్నారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని దానిని సాధించేందుకు ప్రణాళికబద్ధంగా కృషి చేస్తే విజయం సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్, డాక్టర్ నాగార్జున, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, బీసీ ప్రజా చైతన్య సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు, బీసీ సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ సోమా లక్ష్మీనరసయ్య, సందు శివనారాయణ, ఎస్‌ఐ హైమావతి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

వల్లూరు : ప్రజలు సైబర్ నేరాల గురించి పూర్తి స్థాయిలో అవగాహన కలిగి లోన్ యాప్స్ మాయలో పడి మోసపోవద్దని ఎస్‌ఐ పెద్దఓబన్న సూచించారు. మండలంలోని పుష్పగిరి గ్రామంలో ఆదివారం ఆయన తన సిబ్బందితో కలిసి కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలో విస్తృతంగా తనిఖీలను నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రజలతో గ్రామ సభను నిర్వహించి సైబర్ నేరాలు, ఓటీపీ ఫ్రాడ్ వంటి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. అసాంఘిక కార్యకలాపాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు పోలీసులకు తెలియచేయాలని సూచించారు.

శిల్పారామం.. మరింత ఆహ్లాదకరం!



బోటింగ్ యూనిట్ వద్ద జరుగుతున్న పనులు



మొక్కలు నాటుతున్న దృశ్యం



బోటింగ్ ప్రాంతంలో జరుగుతున్న పనులు

- బోటింగ్ యూనిట్ ఆధునికీకరణ
- పచ్చదనంపై ప్రత్యేక దృష్టి

కడప కల్చరల్ : కడప శిల్పారామం సందర్శకులకు మరింత ఆహ్లాదాన్ని కల్పించనుంది. కడప నగరవాసులకు ఉపశమనం కల్పించేందుకు ప్రధాన కేంద్రంగా ఉన్న కడప శిల్పారామంలో సందర్శకులకు అనువైన వాతావరణం కల్పించేందుకు రాష్ట్ర శిల్పారామాల సీఈఓ శ్యామ్‌సుందర్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహించారు. శిల్పారామాల రాష్ట్ర ఏఓ మునిరాజు, కడప నగర శిల్పారామం ఏఓ శివప్రసాద్‌ల పర్యవేక్షణలో ఆధునికీకరణ పనులు జోరుగా సాగుతున్నాయి. శిల్పారామం ప్రధాన ద్వారం వద్ద కనుచూపుమేర పచ్చదనం కనిపించేలా చర్యలు చేపట్టారు. ఇప్పటికే మొక్కలు నాటుతున్నారు. త్వరలో పచ్చికను కూడా పెంచనున్నారు. శిల్పారామంలో అడుగు పెట్టగానే ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలన్న ధ్యేయంతో తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

బోటింగ్ ఆధునికీకరణ

ప్రధానంగా శిల్పారామం మధ్యలో ఉన్న బోటింగ్ యూనిట్‌ను ఆధునికీకరించేందుకు పనులు చురుగ్గా సాగుతున్నాయి. కొన్ని రోజులుగా బోటింగ్ పాండ్‌లోని నీటిని పూర్తిగా తొలగించి ఎండబెట్టారు. అడుగున ఉన్న మట్టి, పాచి, ఇతర వ్యర్థాలను తొలగించి మరోసారి బ్లీచింగ్ పౌడర్ కలిసిన నీటిని నింపి శుద్ధి చేశారు. అడుగు భాగాన్ని ఏమాత్రం అపరిశుభ్రం లేకుండా చేశారు. ఇరువైపులా గోడలకు గల పాచీని తొలగించి తెల్లటి రంగు వేస్తున్నారు. అన్ని పనులు పూర్తయ్యాక బోర్ల ద్వారా వారం రోజులపాటు నీటిని నింపి తిరిగి బోటింగ్ పనులు ప్రారంభించనున్నారు. రానున్న రోజుల్లో శుభకార్యాలు, విద్యార్థులకు సెలవులను దృష్టిలో పెట్టుకుని అప్పటిలోగా పచ్చికను పెంచడంతో పాటు బోటింగ్ యూనిట్‌ను పూర్తి స్థాయిలో అత్యాధునిక వసతులతో అందుబాటులో తెచ్చేందుకు కృషి జరుగుతోంది. బోటింగ్ వెలుపల కూడా ఫంక్షన్లు నిర్వహించుకునేందుకు అనువుగా వేదికగా ఆధునికీకరించడంతోపాటు పచ్చికను కూడా పెంచి ఆ ప్రాంతమంతా ఆహ్లాదకరంగా కనిపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత

చాపాడు : ధ్యానం చేసుకోవటం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని రాష్ట్ర పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్మెంట్ ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని లక్ష్మీపేట గ్రామంలో ఏర్పాటు చేసిన రామచంద్ర మిషన్ ధ్యాన్య కేంద్రాన్ని ఆదివారం నాగార్జునరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం ఒత్తిడితో కూడుకున్న పనుల నుంచి ధ్యాన్యం చేసుకోవడం ద్వారా ప్రశాంతత ఏర్పరచుకోవచ్చన్నారు. ప్రతి రోజూ ధ్యాన్యం చేసుకోవటం ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యం కాపాడుకునే అవకాశం ఎంతైనా ఉందన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చండి

రాయచోటి అర్బన్ : రజకులను షెడ్యూల్డ్ కులాల జాబితాలో చేర్చేంత వరకు పోరాటం చేస్తామని అన్నమయ్య జిల్లా రజక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రమేష్‌బాబు, వి.శ్రీనివాసులు అన్నారు. ఆదివారం పట్టణంలోని బేతల్‌కాలనీలో జిల్లాస్థాయి రజక సంఘం సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ చాలా రాష్ట్రాలలో రజకులు ఎస్సీ, ఎస్టీలుగా కొనసాగుతున్నారన్నారు.

• నాగన్న.. కాపాడవయ్యా..

కడప కల్చరల్ : శ్రావణ మాసం చవితి సందర్భంగా ఆదివారం కడప నగరంలో భక్తులు నాగుల చవితిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వెనుకగల నాగుల కట్ట నాగుల దేవతల విగ్రహాల వద్ద, శంకరాపురం అంధుల పాఠశాల వద్ద, కార్పొరేషన్ కార్యాలయం, రైల్వే స్టేషన్ వద్దగల నాగులకట్ట తోపాటు ఇంకా బయలు ప్రాంతంలోని పుట్టలు, సుబ్రమణేశ్వరస్వామి దేవాలయాలు, ఆలయాల్లోని నాగుల కట్టల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ కుటుంబాలను చల్లగా కాపాడాలని వేడుకున్నారు. పుట్టలకు పసుపు కుంకుమలు, తోరాలు (పచ్చి దారాలు) అలంకరించి పాలుపోసి చలివిడి ముద్దలు, నూగుల ముద్దలు ప్రసాదంగా ఉంచారు. మొక్కులను తీర్చుకున్నారు. పలువురు నాగ పంచమి సోమవారం నాడు కూడా ముగింపు పూజలు చేసేందుకు మొక్కులు చెప్పుకున్నారు. నాగుల చవితి సందర్భంగా ఉదయం 4.30 గంటల నుంచే పుట్టల వద్ద భక్తుల సందడి కనిపించింది.







నాగుల కట్ట వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి జన్మదిన వేడుకలు

పలుచోట్ల సేవా కార్యక్రమాలు

కడప కార్పొరేషన్ : కమలాపురం శాసన సభ్యులు పోచిమరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి జన్మదిన వేడుకలు కడప నగరంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుమ్మా రాజేంద్రప్రసాద్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి ఆధ్వర్యంలో భారీ గజమాలను క్రేన్‌సాయంతో తెచ్చి ఎమ్మెల్యేకు వేసి, కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి నివాసానికి వచ్చి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

■ వైఎస్సార్‌సీపీ నాయకుడు పి. జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించి, మిఠాయిలు తినిపించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

■ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, వారి కుమారులు రషీద్‌ఖాన్, ఫవాజ్‌ఖాన్, ఫయాజ్‌లు ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డికి స్వీటు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

■ కడప డీఎస్పీ ఎస్ఎండీ షరీఫ్, సీఐ అశోక్‌రెడ్డి, ఏపీ వేర్ హౌస్ కార్పొరేషన్ చైర్మన్ ఎస్ ఏ కరిముల్లా, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు పాకా సురేష్ కుమార్, 20వ డివిజన్ ఇన్‌చార్జి శ్రీరంజన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు బంగారు నాగయ్యయాదవ్, ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్‌కుమార్, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు చాన్‌బాషా, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్‌నాయక్, 26వ డివిజన్ ఇన్‌చార్జి త్యాగరాజు, వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు శివానాయక్, 2వ డివిజన్ కార్పొరేటర్ ఎం. సుబ్బారెడ్డి ,8,50,22 డివిజన్ ఇన్‌చార్జులు బాలక్రిష్టారెడ్డి, కె. రాజశేఖర్‌రెడ్డి, రామచంద్రయ్య, బేడబుడగజంగం హక్కుల పోరాట సమితి నాయకుడు పస్తం అంజి, వైఎస్సార్‌సీపీ నాయకుడు రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌టీయూసీ జాషువా, శివకేశవ, మేసా ప్రసాద్ తదితరులు ఎమ్మెల్యేకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఆధ్వర్యంలో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలుచోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహించారు.



ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డితో శ్రీ వెంకటేశ్వర కన్‌స్ట్రక్షన్స్ మేనేజింగ్ పార్ట్‌నర్ వి.వంశీనాథ్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : కమలాపురం ఎమ్మెల్యే పోచిమరెడ్డి రవీంద్రనాథరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం కడపలోని పార్టీ కార్యాలయంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకుల సంఘం జిల్లా సెక్రటరీ రాజారావు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

అరసం అఖిల భారతీయ మహాసభల్లో కడప ప్రతినిధులు

వైవీయూ : ఈనెల 20 నుంచి 23వ తేదీ వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని జబల్పూర్‌లో అభ్యుదయ రచయితల సంఘం అఖిల భారత మహాసభల్లో జిల్లాకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. అరసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్ష వర్గసభ్యులు ఆచార్య ఎస్. ఈశ్వరరెడ్డి, కార్యవర్గసభ్యులు డాక్టర్ టి. సురేష్ బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్. రాజగోపాల్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు ఓబులేసు తదితరులు హాజరై అరసం పతాక ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా వివిధ భాషల రచయితలు వందల సంఖ్యలో హాజరైన ఈ సమావేశంలో ఈనెల 21న ఆచార్య ఎస్. ఈశ్వరరెడ్డి 'రోల్ ఆఫ్ లిటరేచర్ బిల్డింగ్ ఇన్ బిల్డింగ్ ఎ బెటర్ సొసైటీ' అన్న అంశంపై ప్రసంగించనున్నారు.



జబల్పూర్‌లోని మహాసభల ర్యాలీలో పాల్గొన్న జిల్లా అరసం ప్రతినిధులు

గ్రూప్-1 విజేతకు సన్మానం

బద్వేలు అర్బన్ : గ్రూప్-1 ఫలితాల్లో విజేతగా నిలిచి డీఎస్పీ (సివిల్) ఉద్యోగానికి ఎంపికైన గోపవరం మండలం బ్రాహ్మణపల్లె పంచాయతీ ఓబులరెడ్డినగర్ గ్రామానికి చెందిన పల్లం శ్రీనివాసులును ఆదివారం పట్టణంలో జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు బంగారుశీనయ్య, మల్లెంకొండేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ గోవిందరెడ్డి, మున్సిపాలిటీ నాయకులు చెన్నకృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో రాజీవ్ సేవలు మరువలేనివి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : మాజీ ప్రధాని, భారతరత్న దివంగత రాజీవ్ గాంధీ దేశాభివృద్ధికి అందించిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ నాయకులు కొనియాడారు. రాజీవ్‌గాంధీ 79వ జయంతి సందర్భంగా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జ తిరుమలేష్, కాంగ్రెస్ నాయకుడు, న్యాయవాది భువన ఏకాదశి రెడిల్లు స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి కడప నగరంలోని రాజీవ్ పార్కు వద్ద రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంకేతిక, టెలికాం రంగాలలో దేశానికి రాజీవ్ చేసిన కృషి మరువలేనిదన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన త్యాగం రాజీవ్ గాంధీదని కొనియాడారు. రాజీవ్ గాంధీ ఆశయ సాధన కోసం పోరాడతామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జిలాన్, చంద్రశేఖర్, సాయి, వర్ధన్, హరి కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

భవన నిర్మాణ కార్మికునికి నివాళులు

కడప కల్చరల్ : కడప నగరం ఎర్రముక్కపల్లెకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు అన్నరెడ్డి శివారెడ్డికి భవన నిర్మాణ కార్మికుల సంఘం ప్రతినిధులు నివాళులర్పించారు. ఆదివారం సంఘం ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాసులుతో కలిసి వారు సంస్థ కార్యాలయం వద్ద ఇటీవల ఆకస్మికంగా మరణించిన అన్నరెడ్డి శివారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివారెడ్డి సంఘం సంక్షేమానికి కార్మిక వర్గ ప్రతినిధిగా చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. ప్రధాన కార్యదర్శి రాజేంద్ర, కోశాధికారి యల్లారెడ్డి, కార్యవర్గ సభ్యులు సుబ్బారెడ్డి, రమణయాదవ్, రామయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



అన్నరెడ్డి శివారెడ్డికి నివాళులర్పిస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు, కార్మికులు

బాధితురాలికి ఆర్థికసాయం

పోరుమామిళ్ల : రంగసముద్రం పంచాయతీ సుందరయ్య కాలనీకి చెందిన చిట్టిబోయిన లక్ష్మీదేవి రుమటాయిడ్ ఆర్థరైట్స్ అనే వ్యాధితో బాధపడుతోంది. పేద కుటుంబం కావడంతో ఆమె వైద్యం ఖర్చులకు మార్కాపురంకు చెందిన పారిశ్రామికవేత్త గొంగల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ బెంగుళూరు టీమ్ సభ్యుల సహకారంతో ఆదివారం లక్ష్మీదేవికి రూ.80 వేలు ఆర్థిక సాయం అందచేశారు. కలసపాడు మండలం పిడుగుపల్లెకు చెందిన నాగేంద్ర తన డిగ్రీ స్నేహితుల సహకారంతో ఆదివారం రూ.30 వేలు అందచేశారు.

23న సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయ ముట్టడి

కడప ఎడ్యుకేషన్ : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 23వ తేదీన పీడీఎస్‌యూ రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో తాడేపల్లిలోని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయ ముట్టడి కార్యక్రమం చేపట్టనున్నట్లు పీడీఎస్‌యూ నగర అధ్యక్షుడు గణేష్, సహాయ కార్యదర్శి శ్రీనాథ్ తెలిపారు. ఇందుకు సంబంధించిర కరపత్రాలను ఆదివారం కడపలోని ప్రగతి నర్సింగ్‌హోమ్‌లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు రఘురాంసింగ్, నాయక్, ప్రతాప్‌నాయక్, ఆహాక్‌బాబు, హేమంత్, కరీముల్లా, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

మోడీని గద్దె దించుదాం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : మోడీని గద్దె దించుదాం – దేశాన్ని కాపాడుకుందామని పిలుపునిస్తూ నిర్వహించనున్న సీపీఐ బస్సుయాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బస్సు యాత్రకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత తొమ్మిది సంవత్సరాల నరేంద్రమోడీ పాలన అన్ని రంగాల్లో పూర్తిగా విఫలమైందన్నారు. స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఎన్నికల కమిషన్, ఈడీ, సీబీఐ, రిజర్వ్ బ్యాంక్ తదితర అన్ని వ్యవస్థలను తన చెప్పుచేతల్లో పెట్టుకుని వికృత పాలన కొనసాగిస్తున్నారన్నారు. 2014 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ అమలు చేయకపోగా రైతుల, కార్మికుల, మహిళల, విద్యార్థి, యువజనుల హక్కులను హరించే రీతిలో దుష్టచట్టాలు తీసుకొచ్చారన్నారు. ఇలాంటి దుర్మార్గమైన పాలన నుండి దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని తెలియజేసేందుకు సీపీఐ ప్రచారజాతా చేపడుతోందన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సి సుబ్రమణ్యం, బషీరున్నిస్సా, సుబ్బరాయుడు, వేణుగోపాల్, కేసీ బాదుల్లా, గంగాసురేశ్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

అక్టోబర్ 29న ప్రొద్దుటూరు హాఫ్ మారథాన్-2023

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రొద్దుటూరు హాఫ్ మారథాన్-2023 ఐరన్‌మ్యాన్ రన్ ఫర్ యూనిటీని అక్టోబర్ 29న ఉదయం 6గంటలకు రాయల్‌కౌంటీ బైపాస్ వద్ద నుంచి నిర్వహించనున్నట్లు ఐఆర్‌ఎస్ అధికారి ఉండేల రామనాథరెడ్డి పేర్కొన్నారు. స్థానిక రాయల్ కౌంటీ రిసార్ట్స్‌లో ఆదివారం మారథాన్‌కు సంబంధించిన ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీ తత్వం, క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు, ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు సేవాంష్ ట్రస్ట్ ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పెద్ద పెద్ద నగరాలు, పట్టణాలలో మాత్రమే ఈ పోటీలను నిర్వహిస్తారని తాము గతేడాది పట్టణంలో నిర్వహించిన హాఫ్ మారథాన్‌కు విశేష స్పందన లభించిందన్నారు. ఈ పరుగు పోటీల్లో పాల్గొనే వారు అక్టోబర్ 15వ తేదీ లోపల రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ కోసం 9177739100, 8019880995 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సేవాంష్ ట్రస్ట్ కోశాధికారి వడ్డి మురళి, కార్యనిర్వాహకులు అహమద్‌బాషా, ప్రసాదరెడ్డి, సుధాకర్‌రెడ్డి, ప్రభుకుమార్ పాల్గొన్నారు.



మారథాన్‌కు సంబంధించిన ఆహ్వాన పత్రాలను విడుదల చేస్తున్న ఐఆర్‌ఎస్ అధికారి రామనాథరెడ్డి

అప్రమత్తతే ఔషధం



ఎస్‌బీఐ కాలనీలో రోడ్డుపైగల మురికి నీటిలో వెళుతున్న చిన్నారి



లోహియానగర్‌లో రోడ్డుపై నిలిచిన మురికి నీరు

- పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- ఆరోగ్య సూత్రాలు పాటించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : వర్షాకాలంలో పారిశుధ్యం విషయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే చికున్‌గున్యా, డెంగీ, డయేరియా వంటి అంటు వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చని వైద్యాధికారులు సూచిస్తున్నారు.

డయేరియా : కలుషితమైన నీరు, ఆహారం తీసుకోవడం వల్ల డయేరియా వ్యాధి వ్యాపిస్తుంది. దీనివల్ల తరచూ నీళ్ల విరోచనాలు వస్తాయి. దీంతో నీరసం, అతి దాహం ఉంటుంది. ఈ వ్యాధి వచ్చినప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించాలి.

చికున్‌గున్యా : ఈడిస్ దోమ కుట్టడం వల్ల వ్యాధి వ్యాపిస్తుంది. దోమ కుట్టిన తర్వాత 3–12 వారాలలోపు జ్వరం వస్తుంది. తలనొప్పి, వాంతులు, వికారం, హఠాత్తుగా జ్వరం రావడం ఈ వ్యాధి లక్షణాలు. దీనివల్ల శరీరంలో అన్ని కీళ్లపై ప్రభావం చూపుతుంది.

మలేరియా: ఈ వ్యాధి ప్లోమోడియం అనే పరాన్నజీవి వల్ల వ్యాపిస్తుంది. ఈ వ్యాధి ఆడ ఎనాఫిలస్ దోమ కుట్టడం వల్ల వస్తుంది. ఈ దోమలు మంచినీరు, మురుగునీరు నిల్వ ప్రాంతాల్లో ఉండి వ్యాధిని తీవ్రతరం చేస్తాయి. ఈ దోమ కుట్టిన తర్వాత 7–10 రోజుల్లో చలి, వణుకు వంటి నొప్పులతో కూడిన జ్వరం విడిచి వస్తుంది.

డెంగీ : అన్నిటికంటే ప్రాణాంతకమైన వ్యాధి డెంగీ. టైగర్ అనే దోమలు పగటిపూట మాత్రమే కుడతాయి. జ్వరంతోపాటు శరీరంపై ఎర్రటి మచ్చలు, దద్దుర్లు, చిగుర్ల నుంచి రక్తం వస్తుంది.

పాటించాల్సిన జాగ్రత్తలు

■ ఆవాసాల ముందు చెత్త, పెంట కుప్పలు, మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.

■ కొబ్బరి బోండాల చిప్పలు, పాత టైర్లు, పూల కుండీలు లేకుండా చూడాలి.

■ భోజనం ముందు, మలమూత్ర విసర్జన సమయాల్లో కాళ్లు, చేతులు శుభ్రపరుచుకోవాలి.

■ కలుషిత నీరు, చల్లటి ఆహార పదార్థాలకు దూరంగా ఉంటూ వేడి పదార్థాలను తీసుకోవాలి.

■ కాచి చల్లార్చిన నీటిని తాగాలి.

నీరు నిల్వ లేకుండా చూడాలి



కాలువల్లో పారిశుధ్య పనులు సకాలంలో చేయక, తరచూ అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. అలాగే రోడ్డుపై మురుగునీరు నిల్వ చేయడం వల్ల ఇబ్బందికరంగా ఉంటోంది. ఈగలు, దోమల మందులు పిచికారీ చేయాలి. అధికారులు ఇప్పటికైనా నీరు నిల్వ లేకుండా చూడాలి.

- అబ్దుల్ లతీఫ్, ఎస్‌బీఐ కాలనీ, కడప

నీరు నిల్వ లేకుండా చూడాలి



కాలువల్లో పారిశుధ్య పనులు సకాలంలో చేయక, తరచూ అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. అలాగే రోడ్డుపై మురుగునీరు నిల్వ చేయడం వల్ల ఇబ్బందికరంగా ఉంటోంది. ఈగలు, దోమల మందులు పిచికారీ చేయాలి. అధికారులు ఇప్పటికైనా నీరు నిల్వ లేకుండా చూడాలి.

- అబ్దుల్ లతీఫ్, ఎస్‌బీఐ కాలనీ, కడప